

5 వరకు స్నాతకోత్సవం దరఖాస్తులు

కర్నూలు(అర్బన్), మే 31: రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించాల్సిన 4వ స్నాతకోత్సవానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అధికారులు గడువు పొడిగించారు. జూన్ ఐదో తేదీ వరకు విద్యార్థులు తమ డిగ్రీ, పీజీ పట్టాలను పొందేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని రాయలసీమ వర్సిటీ ఉపకులపతి బి.సుధీర్ ప్రేమ్ కుమార్ తెలిపారు. విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి విజ్ఞప్తులు రావడంతో గడువును పెంచి దరఖాస్తుకు వెసులుబాటు కల్పించినట్లు వెల్లడించారు.

జలమా? గరళమా?



నగరంలోని పాతబస్టాండ్ వద్ద మురుగు కాలువలో ఇలా మంచినీటి పైప్‌లైన్



కర్నూలు, మే 31 (ఆంధ్రజ్యోతి):

విజయవాడలో కలుషితమైన కుళాయి నీటిని తాగి ఇద్దరు మృత్యువాత పడ్డారు. గుంటూరులోనూ ఇలాంటి సంఘటనే రెండు నెలల క్రితం జరిగింది. కుళాయిల ద్వారా నగరపాలక సంస్థ సరఫరా చేసే తాగునీరు కలుషితమై.. ఆ నీటినే తాగిన ముగ్గురు మరణించారు. రెండు వందల మందికిపైగా అనారోగ్యంతో ఆస్పత్రిపాలయ్యారు. ఈ సంఘటనలు నగరజీవులను భయకంపితులకు గురి చేస్తున్నాయి. కర్నూలు నగరపాలక సంస్థ సరఫరా చేస్తున్న తాగునీరు ఎంతవరకు సురక్షితం..? అన్న ప్రశ్న సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికే కల్లూరు అర్బన్ వార్డుల్లో పలు ప్రాంతాల్లో రంగుమారిన తాగునీరు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రూ.వందల కోట్లు ఆదాయం ఉన్నా.. నేటికి పాతబస్తీ (ఓల్డ్‌సిటీ)లో డ్రైనేజీల్లోనే తాగునీటి పైపులైన్లు వెళ్తున్నాయి. పైప్‌లైన్ ఏమాత్రం లీకైనా మురుగునీరు తాగునీటి పైపుల్లో కలిసిపోయే ప్రమాదం లేకపోలేదు. అదే జరిగితే ప్రజల ప్రాణాలకు రక్షణ ఏదీ..? నగరంలో ఎలాంటి ప్రమాదం జరిగే అవకాశం లేదని ఇంజనీర్లు అంటున్నారు. డ్రైనేజీ కాలువల్లోనే పైపులై వెళ్తుండటం భయాందోళనను కలిగిస్తోంది.

- డ్రైనేజీల్లో తాగునీటి పైపులైన్లు
- కలుషితమవుతున్న ప్రాణజలం
- ఏ మాత్రం లీకైనా మురుగు నీటిలో కలిసే ప్రమాదం
- వర్షాలొస్తే పరిస్థితి మరీ దారుణం
- కల్లూరు వార్డుల్లో పలు కాలనీలకు రంగుమారిన నీరు సరఫరా



ప్రాణాలతో పాలకుల చెలగాటం

కర్నూలు నగర జనాభా ఆరు లక్షలు పైమాటే. నగరపాలక సంస్థ పాలన సౌలభ్యం కోసం 51 వార్డులుగా విభజించారు. కర్నూలు నియోజకవర్గం పరిధిలో 32, పాణ్యం నియోజకవర్గంలో పరిధిలో 16, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో 3 వార్డులు ఉన్నాయి. మేయర్ సహా ముగ్గురు ఎమ్మెల్యేలు, 51 మంది కార్పొరేటర్లు నగర పాలక సంస్థలో సభ్యులుగా ఉన్నారు. వివిధ రూపాల్లో వస్తున్న ఆదాయం రూ.200 కోట్లుపైగానే ఉంటోంది. అందులో అత్యధికంగా ఆస్తి పన్ను, నీటి పన్ను రూపంలో వస్తున్నదే. నగర ప్రజలకు తాగునీరు, ఇతర అవసరాల కోసం రోజుకు 85-87 ఎంఎల్‌డీ నీటి సరఫరా చేస్తున్నారు. ఆ నీటి సరఫరా కోసం 1,387 కిలోమీటర్లు ఏసీహెడ్‌డీపీ, పీవీసీ, డీఏ, ఎంఎస్, పీఐ, జీఐఎస్ వంటి ఆరు రకాల పైపులైన్లు ఉన్నాయి. వాణిజ్య కుళాయి కనెక్షన్లు 2,100, గృహాల తాగునీటి కుళాయిలు 62,131 ఉన్నాయి. ఓల్డ్ సిటీలో 1 నుంచి 12 వార్డుల్లో తాగునీటి పైపులు ముప్పాతిక శాతం డ్రైనేజీల్లోనే ఉన్నాయి. పాతకాలం నాటి పైపులు కావడంతో అవి ఇప్పుడు లీక్ అవుతాయోనని ప్రజలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌కు ఏటా రూ.200 కోట్లు ఆదాయం వస్తోంది. సిబ్బంది జీతాలు, నిర్వహణ ఖర్చులు, విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం ఏటా రూ.25 కోట్లకు పైగా ఖర్చు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రూ.కోట్లు ఆదాయం ఉన్నా తాగునీటి సరఫరా పైపులైన్లు సురక్షితంగా ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. రాబడి వచ్చే సీసీ రోడ్లపై చూపుతున్న శ్రద్ధ ప్రజలకు ప్రాణ జలాలు అందించే తాగునీటి పైపులైన్లపై చూపడం లేదు.

కూడళ్ల అభివృద్ధి చేస్తున్నారు. రోడ్లకు రంగులు వేస్తున్నారు. బ్యూటిఫికేషన్ పేరిట పార్కులు తీర్చిదిద్దుతున్నారు. నగర అభివృద్ధికి ఇవి అవసరమే. అదే క్రమంలో ప్రజలకు ప్రాణ జలం అందించే తాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. పైపులు లీకేజీలు ఏర్పడి మురుగునీరు అందులో కలిసి తాగునీరు కలుషితమైతే డయేరియా, అతిసారం ప్రబలి ప్రజల ప్రాణాలకు ప్రమాదం లేకపోలేదు. పాతబస్తీ (ఓల్డ్ సిటీ) చిత్తరవీధి, కుమ్మరిగేరి, పింజరిగేరి, పూలబజారు, వడ్డేగేరి, బండిమెట్ట, కండేరి, గడ్డ, పెద్దమార్కెట్, చిదంబరరావు వీధి, మాసుంభాషా దర్గా ఏరియా ఈ ప్రాంతాలు 1 నుంచి 12 వార్డులు ఉన్నాయి. 14,15 వార్డుల పరిధిలో బుధవారపేట వస్తుంది. ఈ ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు మురుగునీటి కాల్వల్లోనే ఉన్నాయి. ఈ పైపులు సురక్షితంగా బయట ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కొన్నేళ్లుగా ఉన్నా పాలకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం రెండు వార్డుల్లో మురుగు కాల్వల్లో తాగునీటి పైపులు తీసి బయట ఏర్పాటు చేశారు. పది వార్డులు పట్టించుకోలేదు. ఏటా రూ.200 కోట్లు ఆదాయం ఉంటే.. ప్రజల ప్రాణ జలం అందించే పైపులైన్ల కోసం రూ.2-3 కోట్లు ఖర్చు పెట్టలేరా..? అనే ప్రశ్నలు వెల్లువెత్తున్నాయి. రూ.2 కోట్లలో పైపులైన్లు మార్పు ప్రతిపాదనలు సిద్ధం చేసినా టెండర్లకు నోచుకోలేదు. వానలొస్తే మురుగు కాల్వలు ఉప్పొంగుతాయి. నీటి ఒత్తిడికి పైపులు లీకేజీలు ఏర్పడితే తాగునీరు కలుషితమై ప్రాణాలకే ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నా.. నగరపాలక సంస్థ పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.





50 ఏళ్ల క్రితం వేసిన పైపులే శరణ్యం

నగరంలో తాగునీటి పైపులైన్లు ఆధునికీకరించడంలో పాలకులు, అధికారుల్లో చిత్తశుద్ధి లోపించింది. ఓల్డ్‌సిటీలో 40-50 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైపులే నీటి సరఫరా ఆధారం. మురుగునీటి కాలువల్లో ఆ పైపులు ఉన్నాయి. పద్ధతి ప్రకారం పైపులైన్ ఏర్పాటు చేయకపోతే విజయవాడ కంటే ఘోర పరిస్థితులు కర్నూలు నగరంలో చూడాల్సి వస్తుందేమో. తాగునీరు కలుషితమై ప్రజలు ప్రాణాలు పోకముందే నగర పాలక సంస్థ అధికారులు, పాలకులు అప్రమత్తమై తాగునీటి పైపులైన్లను మురుగు కాల్వల నుంచి తీసి బయట ఏర్పాటు చేయాలి.

- పుల్లారెడ్డి, పట్టణ పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు, కర్నూలు

ఎలాంటి ఇబ్బందులు లేవు

నగరంలో 1,387 కిలోమీటర్లు తాగునీటి సరఫరా పైపులైన్లు ఉన్నాయి. 1-12 వార్డుల్లో ఓల్డ్‌సిటీలో పైపులు ముగురు కాలువల్లో ఉన్నాయి. ఎక్కడా కూడా లీకేజీలు లేవు. నిత్యం పర్యవేక్షిస్తున్నాం. వీటిని కూడా డ్రైనేజీల నుంచి బయట ఏర్పాటు చేసేందుకు రూ.2 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. త్వరంలో టెండర్లు పూర్తి చేసి పనులు చేపడుతాం. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవు. తాగునీటి సరఫరా విభాగం అప్రమత్తంగా ఉంది. ప్రజలు ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయంటే తక్షణమే మర్మతులు చేపట్టేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశాం.

- రవిప్రకాశ్ నాయుడు, డీఈఈ, నగరపాలక సంస్థ, కర్నూలు



బుధవారపేటలో మురుగు కాలువలో తాగునీటి పైప్‌లైన్

కల్లూరు అర్బన్ వార్డుల్లో దారుణ పరిస్థితి

పాణ్యం నియోజకవర్గంలో కల్లూరు అర్బన్ 16 వార్డులు ఉన్నాయి. ముజఫర్ నగర్, లక్ష్మీపురం, పందిపాడు, పెద్దపాడు, వీకర్ సెక్షన్ కాలనీ, న్యూ కృష్ణానగర్ వంటి ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా వేదిస్తుంది. రెండు రోజులకు ఒకసారి తాగునీరు ఇస్తున్నారు. ఆ నీరు కూడా రంగుమారి వస్తున్నాయని, సక్రమంగా శుద్ధి (ఫిల్టర్) చేయడం లేదన్న ఆరోపణలున్నాయి. రెండు రోజుల క్రితం ముజఫర్ నగరంలో రంగుమారిన నీరు కుళాయిలకు సరఫరా చేశారని ఆ కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. జంగాల కాలనీ, శివప్ప నగర్ ప్రాంతాల్లో ప్రాంతాల్లో తాగునీటి పైపులు లీకై మురుగునీరు కలుస్తోందని ప్రజలు పేరొన్నారు. ఓట్ల కోసం ఎన్నికల ముందు రిపేరీలు చేశారు.

జిల్లాలో ఇది పరిస్థితి

- ఆదోని పట్టణ జనాభా 3 లక్షలకు పైగానే ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం 1865లోనే మున్సిపాలిటీగా ఏర్పడింది. తాగునీటి సరఫరా కోసం 300 కిలోమీటర్లు పైపులైన్లు ఉన్నాయి. పలు కాలనీల్లో దశాబ్దాలు క్రితం ఏర్పాటు చేసిన తాగునీటి పైపులే ఆధారం. మురుగునీటి కాలువల్లో ఎక్కువ శాతం పైపులు ఉన్నాయి. ఎన్జీవో కాలనీ క్రాస్, తిక్కస్వామి దర్గా, పాతబస్టాండ్ ప్రాంతం, ఆలూరు రోడ్డు ఏరియా, అమరావతి నగర్ ప్రాంతాల్లో నిత్యం పైపులు లీకేజీలు ఏర్పడుతున్నాయి. పాతకాలం నాటి తాగునీటి పైపులు తీసే కొత్త పైపులైన్ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- ఎమ్మిగనూరు మున్సిపాలిటీ 1965లో ఏర్పాటైంది. ప్రస్తుత జనాభా 1.20 లక్షలు. తాగునీటి సరఫరా చేసే పైపులైను 23 కిలో మీటర్లు ఉంది. లక్ష్మీపేట, ముగతి పేట, సంజీవయ్య నగర్, కటిక వీధి, సున్నపుబట్టి ఏరియా.. వంటి పాత పట్టణంలో మెజార్టీగా మురుగునీటి కాలువల్లోనే తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. ఏ మాత్రం లీకేజీలు ఏర్పడినా ముగురునీరు పైపుల్లో చేరి ప్రజల ప్రాణాలకే ప్రమాదం. కొత్త పైపులైన్ ఏర్పాటు చేయాలనే ప్రజల డిమాండ్‌ను పట్టించుకునేవారే లేరు.
- గూడూరు నగర పంచాయతీగా 2011లో ఏర్పడింది. జానాభా 24,575 మంది ఉన్నారు. రోజుకు 1.6 ఎంఎల్‌డీ (16 లక్షల లీటర్లు) తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ నీటి సరఫరా కోసం 52 కిలో మీటర్లు పైపులైన్లు ఉన్నాయి. పంచాయతీ నుంచి నగర పంచాయతీగా మార్పడంతో తాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని ప్రజలు ఆశించారు. పన్నుల మోత తప్పా తాగునీటి సరఫరాలో పంచాయతీ స్థాయికి మించి పెరగలేదు. ఇక్కడ కూడా పట్టణంలో తాగునీటి పైపులైన్లు ఆధునికీరించాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 31: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. కర్నూలు జిల్లాలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 22,943 మంది ఉన్నారు. ఇందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 15,981 మంది విద్యార్థుల కోసం 35 సెంటర్లను ఏర్పాటు చేశారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 6,194 మంది కాగా, వీరికి జిల్లా వ్యాప్తంగా 22 సెంటర్లను ఏర్పాటు చేశారు. జూన్ 1వ తేదీన ప్రారంభం కావాల్సిన జవాబు పత్రాల మూల్యాంకనం 5వ తేదీకి వాయిదా పడింది. జూన్ 5వ తేదీ నుంచి ఆన్సర్ షీట్స్‌ను అప్‌లోడ్ చేసి 8వ తేదీ నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తెలిపారు.

- అలాగే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. అయితే జూన్ 3వ తేదీ వరకు ఒకేషనల్ కోర్సుల పరీక్షలు కొనసాగుతాయి. జిల్లాలో మొత్తం విద్యార్థులు 17,458 మంది నమోదు చేసుకున్నారు. 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం జరిగిన పరీక్షకు 7,843 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అందులో 5,958 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 1,885 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

కౌంటింగ్ కేంద్రాల్లో సెల్‌ఫోన్లు నిషేధం

కర్నూలు(కలెక్టరేట్), మే 31: కౌంటింగ్ రోజున మొబైల్ ఫోన్లను కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకువెళ్లరాదని జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన ఎన్నికల సిబ్బందికి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్‌కు ఇచ్చే రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన కౌంటింగ్ ప్రక్రియలో ఈవీఎం కౌంటింగ్ ఒకటి, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉంటాయన్నారు. జూన్ 2వ తేదీన ర్యాండమైజేషన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంలు లెక్కింపు ఎవరు చేస్తారనేది తెలిసే అవకాశం ఉంటుందన్నారు. జూన్ 3న కౌంటింగ్ సిబ్బంది మొత్తాన్ని రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ కేంద్రాలకు తీసుకుని వెళ్లివారు కౌంటింగ్ విధులు నిర్వహించాల్సిన గదులను రిటర్నింగ్ అధికారులు చూపించడంతో పాటు అక్కడ ఏమైనా సందేహాలు ఉన్న నివృత్తి చేస్తామని చెప్పారు. కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్ ఆన్ చేసినప్పుడు డిస్‌ప్లే రాకపోతే ఆర్వోకు సమాచారం ఇచ్చి ఆ రౌండుకు సదరు సిబ్బంది ఖాళీగా ఉంటారే తప్ప ఇంకో మిషన్ తెచ్చి కౌంట్ చేయడం జరగదన్నారు. డిస్‌ప్లే లేని, ఇన్వాలిడ్ అని వచ్చిన ఈవీఎంలకు సంబంధించిన వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తామని తెలిపారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

నాన్నకు ప్రేమతో...

- కలెక్టర్ హోదాలో తండ్రిని సత్కరించిన క్రాంతి
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు అరుదైన గౌరవం



తల్లిదండ్రులతో కలెక్టర్

కర్నూలు(హాస్పిటల్), మే 31: ఓ వైపు కలెక్టర్ హోదాలో ఎన్నికల విధులు.. మరోవైపు తండ్రి పదవీ విరమణ కార్యక్రమం. రెండు కార్యక్రమాలు ముఖ్యమే. ఉన్నకొద్దిపాటి సమయంలోనే కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి పదవీ విరమణ కార్యక్రమానికి వచ్చారు ఆయన కుమార్తె వల్లూరి క్రాంతి. ప్రస్తుతం ఆమె తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి శుక్రవారం పదవీ విరమణ చేశారు. ఏపీజీడీఏ వైద్యుల సంఘం సూపరింటెండెంట్‌కు సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీలో వెంకటరంగారెడ్డి కుమార్తె సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి కలెక్టర్ హోదాలో తండ్రిని సత్కరించారు. ఎన్నికల వేళ ఒక్క కలెక్టర్ చాలా బిజీగా ఉన్నారు. అయినా తండ్రిపై ప్రేమతో పదవీ విరమణ కార్యక్రమానికి కర్నూలుకు వచ్చి తల్లిదండ్రులను సత్కరించారు. ఓ వైపు తండ్రిపై ప్రేమ, మరోవైపు అత్యవసర విధులు.. వెరసి కలెక్టర్ వల్లూరి క్రాంతి తన బాధ్యతను పూర్తి చేశారు. తల్లిదండ్రులను సత్కరించగానే కలెక్టర్ నేరుగా ఎన్నికల విధుల కోసం సంగారెడ్డి జిల్లాకు పయనమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ తన తండ్రి నుంచి ఎంతో నేర్చుకున్నానని, ఆయనే తనకు మార్గదర్శకమన్నారు. కర్నూలులో చదివి కలెక్టర్ కావడం వెనుక తన అమ్మానాన్నల కృషి ఎంతో ఉందన్నారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను సన్మానిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

నేటి నుంచి జూనియర్ కళాశాలల పునఃప్రారంభం



కర్నూలు(ఎడ్యుకేషన్), మే 31: వేసవి సెలవుల అనంతరం శనివారం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యజమాన్యాల కళాశాలలు, జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. పాత సమస్యలతోనే కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు మొత్తం 166 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 23 ఉన్నాయి. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలను మినహాయిస్తే.. జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల దుస్థితి దయనీయంగా ఉంది. గత ఏడాది క్రితం మనబడి నాడు-నేడు కింద 23 జూనియర్ కళాశాలలో వివిధ పనులు చేపట్టారు. నిధుల కొరతతో ముఖ్యంగా భవన నిర్మాణ పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఈ పనులను పూర్తి చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లోపించింది. అలాగే ప్రభుత్వ కళాశాలల్లో గదుల కొరతతో పాటు అధ్యాపకుల కొరత, మౌలిక వసతుల సమస్యలు వేధిస్తున్నాయి. ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకులను నియమించడంలో పూర్తిగా విఫలమైంది. కాంట్రాక్టు లెక్చరర్లతోనే తరగతులను నెట్టుకొస్తున్నారు. అలాగే ప్రిన్సిపాళ్ల కొరత కూడా ఉంది. మూడు సంవత్సరాల నుంచి జిల్లా వృత్తి విద్యాధికారి, ఆర్ఐవో పోస్టులు ఇన్‌చార్జి అధికారులతోనే కొనసాగుతున్నాయి. కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆర్ఐవో, డీవీఈవో పోస్టులను ఇన్‌చార్జిలకు అప్పగించడంతో ఈ రెండు పోస్టులకు న్యాయం చేయలేకపోతున్నారనే విమర్శలున్నాయి. ఉపాధ్యాయుల కొరత, అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడం వల్ల ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం ఆశించినంత రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకుని రెగ్యులర్ అధ్యాపకులతో పాటు ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులు, వృత్తి విద్యాధికారి, ఆర్ఐవోలను నియమించాలని కోరుతున్నారు.

నేటి నుంచి ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 31: కర్నూలు జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం నుంచి జూన్ 8వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఓపెన్ స్కూల్ 10వ తరగతి పరీక్షలకు మొత్తం 930 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఈ విద్యార్థుల కోసం ఆదోనిలో 1, కర్నూలులో 2, ఎమ్మిగనూరులో 1, పత్తికొండలో 1 మొత్తం 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 5:30 గంటల వరకు కొనసాగుతాయి. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులు 1,265 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విద్యార్థుల కోసం ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు, పత్తికొండలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు జూన్ 10 నుంచి 12వ తేదీ వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరగనున్నాయి. ఇంటర్ ప్రాక్టికల్స్ కోసం రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అంచనాలు తారుమారు..!

- కౌంటింగ్‌కు ముందే చేతులెత్తేసిన వైసీపీ
- అయినా కింది స్థాయి నేతలను రెచ్చగొడుతున్న వైనం
- వైసీపీ గెలుపుపై పందెంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు
- ప్రతి సవాల్ విసురుతున్న తెలుగు తమ్ముళ్లు

'మంత్రాలయం వైసీపీ అభ్యర్థి బాలనాగిరెడ్డి గెలుస్తాడు.. జగన్ సీఎం అవుతాడు. రూ.20 లక్షలు పందెం పెడుతున్నా.. దమ్మున్న వాళ్లు ఎవరైనా ఉంటే శనివారం ఉదయం 10 గంటలకు యల్లమ్మగుడి వద్దకు రావాలి'
- కోసిగి వైసీపీ మాజీ జడ్పీటీసీ దళవాయి మంగమ్మ సవాల్.

'ఓ మంగమ్మ..! మంత్రాలయం టీడీపీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి గెలుస్తాడు. చంద్రబాబు సీఎం అవుతాడు. నా రెండు ఎకరాలు పొలం పందెం పెడుతున్నా, బోరు బావి కూడా ఉంది. ఆ పొలం విలువ రూ.50 లక్షలు ఉంటుంది. నరసప్ప గుడి వద్దకు వస్తా.. మీకు దమ్ముంటే రండి'
- మంత్రాలయం మండలం వగరూరుకు చెందిన టీడీపీ కార్యకర్త మాంత్రికి చిన్నన్న ప్రతి సవాల్



కర్నూలు, మే 31 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపుపై ఆయా పార్టీల శ్రేణులు పందెం నీదా.. నాదా సై అంటూ బహిరంగ ఛాలెంజ్‌లతో రాజకీయం వేడెక్కింది. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కోసిగి మండలం వైసీపీ మాజీ జడ్పీటీసీ సభ్యురాలు దళవాయి మంగమ్మ ముందుగా ఓపన్ ఛాలెంజ్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో చూసిన టీడీపీ వీరాభిమాని వగరూరు చిన్నన్న రెండెకరాల పొలం పందెం పెడుతున్నాను అంటూ ప్రతి సవాల్ విసిరాడు. ఈ వీడియోలు పరిశీలిస్తే గెలుపుపై అంచనాలు సన్నగిల్లడంతో ప్రత్యర్థి పార్టీ శ్రేణులను రెచ్చగొట్టేందుకే వైసీపీ నాయకులు బెట్టింగ్ ఛాలెంజ్‌కు తెర తీశారనే రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వ్యూహంలో భాగంగానే వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మాజీ జడ్పీటీసీ మంగమ్మ ద్వారా ఛాలెంజ్ చేయించి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గంలో కూడా కీలకమైన నామినేటెడ్ పదవిలో ఉన్న వైసీపీ నాయకుడు ఒకరు 'మా పార్టీ అభ్యర్థి గెలుస్తాడు.. రూ.50 లక్షలు పందెం.. దమ్ముంటే పందెం పెట్టేందుకు రండి..' అంటూ ఛాలెంజ్ విసిరినట్లు తెలిసింది. ఈ రెండు నియోజకవర్గాల్లోనే కాదు.. ఉమ్మడి జిల్లాలో మెజార్టీ నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితే ఉందని తెలుస్తుంది. పోల్ మేనేజ్‌మెంట్‌లోనూ.. డబ్బులు పంపకంలోనూ.. గ్రామాలకు గ్రామాల్లోనే తమకు అనుకూలత రెట్టింపు చేసుకున్నాం.. మాదే పైచేయి అంటూ మొదట్లో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. పోలింగ్ తరువాత లెక్కలు వేసి ఎంతెంత మెజార్టీ వస్తుందో ప్రచారం కూడా చేసుకున్నారు. తాజా పరిస్థితులు చూసిన వైసీపీ నాయకులు, ఆ పార్టీ అభ్యర్థులకు గెలుపు ఆశలు సన్నగిల్లడంతో ప్రత్యర్థి పార్టీ శ్రేణులను రెచ్చగొట్టే ఎత్తులు వేస్తున్నారని, అందులో భాగమే పందెం అంటూ ఓపన్ చాలెంజ్‌లు చేస్తున్నారు.

జిల్లాలో టీడీపీ సత్తా చాటుతుంది

ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ మొత్తం స్థానాల్లో విజయం సాధించింది. టీడీపీ ఒక్క స్థానంలో కూడా విజయం సాధించలేపోయింది. అయితే ప్రస్తుతం మాత్రం మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తామని టీడీపీ శ్రేణులు ధీమాగా ఉన్నారు. అదే క్రమంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని అంచనాలు వేస్తూ చెబుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వ ఏర్పాటు చేస్తుందంటూ కర్నూలు నగరానికి చెందిన ఓ వ్యక్తి రూ.15 లక్షలు పందెం కాశారు. ఆదోనికి చెందిన ఓ వ్యక్తి వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందంటూ కర్ణాటక రాష్ట్ర శిరుగుప్పలో రూ.5 లక్షలు బెట్టింగ్ పెట్టారు. అయితే శిరుగుప్పలో ఉన్న సెటిలర్స్ (కోస్తాంధ్ర ప్రాంతం వారు) కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని... రూ.లక్షకు రూ.2 లక్షలు ఇస్తామంటూ ఆఫర్ ఇచ్చారు. వైసీపీ శ్రేణులు మాత్రం ఈ బంపర్ ఆఫర్‌ను ఏమాత్రం స్వీకరించడం లేదు. పొత్తుల్లో భాగంగా ఆదోని సీటు బీజేపీకి ఇవ్వడం, కూటమి అభ్యర్థిగా డాక్టరు పార్థసారథి బరిలో దిగడంతో.. అక్కడ వైసీపీ అభ్యర్థి వై.సాయిప్రసాద్‌రెడ్డి 75 వేలు నుంచి లక్ష మెజార్టీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేసుకున్నారు. పోలింగ్ నాటికి పరిస్థితులు మారిపోయాయి. పోలింగ్ దగ్గర పడేకొద్దీ అదే నేతలు 5 నుంచి 15 వేల ఓట్లతో తెలుస్తామంటూ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం మెజార్టీ చెప్పలేం.. గెలుపు మాత్రం మాదే అంటూ మళ్లీ మాట మార్చేశారు. వైసీపీ గెలుస్తుందని ఆ పార్టీ అభిమాని అయిన న్యాయవాది ఒకరు రూ.లక్ష పందెం పెట్టారు. కూటమి అభ్యర్థి పార్థసారథి గెలుస్తాడంటూ టీడీపీ నాయకుడు ఒకరు రూ.2 లక్షలు పందెం పెట్టినట్లు తెలిసింది. కర్నూలులో టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ గెలుపుపై పెద్ద ఎత్తున బెట్టింగ్ జరిగినట్లు సమాచారం. ఆలూరులో టీడీపీ అభ్యర్థి బి.వీరభద్రగౌడ్ గెలుస్తారని బళ్లారికి చెందిన ఓ కాంట్రాక్టరు రూ.లక్షల్లో బెట్టింగ్ పెట్టినట్లు సమాచారం. ఎక్కువ శాతం రాష్ట్రంలో టీడీపీ సారథ్యంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్న దానిపై బెట్టింగ్ కాసినట్లు తెలుస్తుంది.





పోలీసులుగా పదవీవిరమణ
పొందడం గర్వకారణం
ఎస్పీ జి.కృష్ణకాంత్



పదవి విరమణ పొందిన పోలీస్ దంపతులను సన్మానిస్తున్న ఎస్పీ

కర్నూలు, మే 31: సుదీర్ఘ కాలం పోలీసు శాఖలో పని చేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ జి.కృష్ణకాంత్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో పదవి విరమణ పొందిన 9 మంది పోలీసులను ఎస్పీ పూలమాలలు, శాలువలతో సన్మానించారు. పదవి విరమణ పొందిన వారిలో ఎన్. అబ్దుల్ అజీజ్ (వీసీఆర్, కర్నూలు ఎస్ఐ), డి. రాజన్న (స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ), ఎస్ఎండీ జాఫర్ హుశేన్ (కర్నూలు వన్‌టౌన్ ఎస్ఐ), వీవీ రామిరెడ్డి (కర్నూలు వన్‌టౌన్ ఎస్ఐ), ఎస్. చంద్రశేఖర్ రావు (ఏఆర్ఎస్ఐ), ఎస్.చెంచయ్య (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్), జి.ఇన్నయ్య (కర్నూలు ఒకటో పట్టణ ఏఎస్ఐ), ఎస్‌జీ నజీర్ అహ్మద్ (చిప్పగిరి పీఎస్ ఏఎస్ఐ), ఆర్.హరిబాబు (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్)లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగరాజు యాదవ్, ఆర్ఐలు జావేద్, నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు, పదవి విరమణ పొందిన పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెరువును ఆక్రమించుకున్న రియల్ వ్యాపారి
ఆందోళనకు దిగిన గ్రామస్థులు

ప్యాపిలి, మే 31: ప్యాపిలిలో చెరువు భూమిని ఆక్రమించుకున్న ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. చెరువు ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో గ్రామస్తులు, రైతులు శుక్రవారం ఆక్రమిత భూమి దగ్గర ఆందోళన చేశారు. పట్టణం సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన 896 సర్వే నెంబరులో నాయుడి చెరువు ఉంది. ఈ చెరువు పక్కనే ఓ రియల్ వ్యాపారి దాదాపు 20 ఎకరాల పొలం కొని వెంచర్ వేస్తున్నాడు. పనిలో పనిగా ఎవరూ అడగరు కదా దాదాపు ఎకరా చెరువు భూమిని ఆక్రమించాడు. ఈ భూమి విలువ రూ.లక్షల్లో పలుకుతోంది. రియల్ వ్యాపారి ఆక్రమణ సంగతిని పలుమార్లు రెవెన్యు అధికారుల దృష్టికి గ్రామస్తులు, రైతులు తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో వివిధ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు, గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రియల్ వ్యాపారి దౌర్జన్యంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. అలాగే ప్రభుత్వ భూమిలో ఉన్న నాలుగు బోర్లను కూడ పూడ్చి వెంచర్ వేశారన్నారు. రియల్ వ్యాపారి దౌర్జన్యాన్ని ఆపకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లుతామని రైతులు హెచ్చరించారు. అనంతరం వారు ఆర్ఐ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నేతలు, రైతులు టి శ్రీనివాసులు, గడ్డం భువనేశ్వరరెడ్డి, బోరెడ్డి క్రిష్ణారెడ్డి, రజనీ కాంత్‌రెడ్డి, కొండయ్య, గండికోట పెద్దరామాంజినేయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం
మరొకరికి తీవ్రగాయాలు

జూపాడుబంగ్లా, మే 31: మండలంలోని పారుమంచాల చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళుతూ విద్యుత్తు స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు క్షతగాత్రుడ్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బుధవారపేటకు చెందిన వెంకటేశ్వర్లు పారుమంచాల గ్రామానికి చెందిన రాములమ్మను పెళ్లి చేసుకుని ఇక్కడే గౌండా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. శుక్రవారం వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు ఇరువురు జూపాడుబంగ్లాకు ద్విచక్రవానంపై పని నిమిత్తం వచ్చి తిరిగి వెళుతుండగా పారుమంచాల చెక్‌పోస్టు మలుపు వద్ద కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో వెంకటేశ్వర్లు(40) అక్కడిక్కడే మృతిచెందాడు. నాగేశ్వరరావుకు తీవ్రగాయాలు అయ్యాయి. క్షతగాత్రుడ్ని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా
డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

కర్నూలు(హాస్పిటల్), మే 31: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా సిటీ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సూపరింటెండెంట్ చాంబరులో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి నుంచి చార్జ్ తీసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యసిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ఆసుపత్రికి సంబంధించిన ఫైల్స్‌ను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్‌కు మించిన సేవలు అందించాలని అందుకు అందరూ సహకరించాలన్నారు. తన మొదటి ప్రాధాన్యత రోగులకు మెరుగైన సేవలు అందించడమేనని ఆసుపత్రిని ప్రక్షాళన చేయడమే లక్ష్యమన్నారు. అందరి సహకారంతో ఆసుపత్రి రూపురేఖలు మారుస్తానని, అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి

పరీక్షల కోసం రూ.లక్షల్లో వసూలు
డీఈఓపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ

కర్నూలు ఎడ్యుకేషన్/ఆదోని అగ్రికల్చర్, మే 31: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ టెన్త్, ఇంటర్) పరీక్షల కోసం డీఈఓ శామ్యూల్ రూ.లక్షల్లో వసూలు చేసినట్లు ఆదోని డెవలప్‌మెంట్ ఫోరం ఆరోపిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖ వైరల్ అవుతోంది. పైగా ఈ ఫిర్యాదును లోకాయుక్తకు, కలెక్టర్‌కు అందజేసినట్లుగా ఉండటం చర్చనీయంశమైంది. జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయకుండా ఉండేందుకు రూ.20 లక్షలు మామూళ్లు తీసుకున్నట్లు కలెక్టర్‌కు, లోకాయుక్తకు ఫిర్యాదు చేసినట్లు ఆదోని డెవలప్‌మెంట్ ఫోరం లెటర్‌హెడ్‌తో ఓ లేఖ విడుదలైంది. ప్రస్తుతం లేఖ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆదోని, ఎమ్మిగనూరు పరీక్ష కేంద్రాలు తనిఖీ చేయకుండా పాఠశాల నిర్వాహకులు, జిల్లా విద్యాశాఖ అధికారి మధ్య ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆ లేఖ సారాంశం. దీనిపై పూర్తి వివరాలు తమ దగ్గర ఉన్నాయంటూ అందులో పేర్కొన్నారు. విచారణ చేసి జిల్లా అధికారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదోని డెవలప్‌మెంట్ ఫోరమ్ లెటర్‌హెడ్ పేరిట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.ప్రసాద్‌రావు, పి.వెంకటేశ్, ఉపాధ్యక్షులు కిరణ్మయిలు ఈ ఫిర్యాదు చేసినట్లు ఉంది.

ఈ విషయంపై డీఈఓ శామ్యుల్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. గత మార్చి, ఏప్రిల్ నెలలో జరిగిన పరీక్షలను తాము పకడ్బందీగా నిర్వహించామన్నారు. ఫలితంగా పరీక్షల ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గిందన్నారు. మాస్ కాపీయింగ్ చేయిస్తామని కొందరు నిర్వాహకులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.8వేల దాకా వసూలు చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని జూన్ 1వ తేదీ నుంచి జరిగే పరీక్షలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఒక కళాశాల యజమాన్యం నిరాధారమైన ఆరోపణలు చేస్తోందని తెలిపారు. త్వరలోనే ఆ కళాశాల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈవో వివరించారు.

ఎన్నికల ఫలితాలను మీడియాకు అందించండి

జిల్లా ఎన్నికల అధికారి జి. సృజన

కర్నూలు(కలెక్టరేట్), మే 31: కమ్యూనికేషన్ సెంటర్ల ద్వారా త్వరితగతిన ఎన్నికల ఫలితాలను మీడియాకు అందించాలని కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని మీడియా, కమ్యూనికేషన్ సెంటరులో ఏర్పాట్లను కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పరిశీలించారు. 4 టీవీలలో, 4 న్యూస్ చానల్స్ మొత్తం 8 న్యూస్‌చానల్స్ వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మీడియా ప్రతినిధులు కౌంటింగ్ హాలులో విజువల్స్ తీసుకునేందుకు 5 నుంచి 6 మందిని వాహనంలో తీసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని సమాచార పౌర సంబంధాల అధికారిని ఆదేశించారు. మీడియా ప్రతినిధులకు మీడియా సెంటరు వరకు మాత్రమే మొబైల్ ఫోన్ల అనుమతి ఉందని, కౌంటింగ్ హాలులోకి అనుమతి లేదని తెలియజేశారు. ఇంజనీరింగ్ బ్లాకులోని కంట్రోల్, కమ్యూనికేషన్ రూమ్‌ను పరిశీలిస్తూ కమ్యూనికేషన్ రూమ్ అని తెలిసేవిధంగా బోర్డు, కౌంటింగ్ రిజర్వుడ్ సిబ్బంది లైబ్రరీ బ్లాక్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో కూర్చునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ రిజర్వుడ్ సిబ్బంది అనే బోర్డు కూడా ఏర్పాటు చేయించాలని డీఆర్వోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు, కుడా వైస్ ఛైర్మన్ వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి ప్రతాప్ రెడ్డి, సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి జయమ్మ, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలుఇస్తున్న కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన, ఎస్పీ జి. కృష్ణకాంత్

రాయలసీమ హక్కులపై నిర్లక్ష్యమేనా..?

- శిథిలావస్థకు చేరిన ప్రాజెక్టులపై నూతన ప్రభుత్వం దృష్టి పెట్టాలి
- జూన్ 10న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవం
- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



సమావేశంలో పాల్గొన్న సాధన సమితి నాయకులు

నంద్యాల టౌన్, మే 31 : రాష్ట్ర విభజన జరిగి 10 సంవత్సరాలైనా రాయలసీమ హక్కుల అమలుపై పాలకులు నిర్లక్ష్యం వహించారని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి అన్నారు. మరికొద్ది రోజుల్లో నూతన ప్రభుత్వం ఏర్పడబోతున్న సందర్భంగా రాయలసీమ ప్రజా సంఘాల ప్రతినిధుల సమావేశం నంద్యాలలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమ అభివృద్ధికి ఉన్న అనేక హక్కులను అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన కృష్ణా జలాల పంపకం వలన తెలుగుగంగ, గాలేరు -నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ ప్రాజెక్టులకు 100 సంవత్సరాల్లో ఒకటి లేదా రెండు సంవత్సరాలలో మాత్రమే నీరు లభించే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ ఇబ్బందులను అధిగమించడానికి దుమ్ముగూడెం, నాగార్జునసాగర్ ఆయకట్టుకు గోదావరి నీరు అందించి కృష్ణా జలాలను పై ప్రాజెక్టులకు అందించాల్సి ఉందని అన్నారు. విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించాల్సిన పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం నిధుల మళ్లించడం వల్ల తెలుగుగంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలుగొండ ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు సాగడం లేదని అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం రాయలసీమ ప్రాజెక్టుల నిర్వహణకు కూడా సరిగా నిధులు కేటాయించకపోవడంతో రాయలసీమలో నికర జలాలపై నిర్మించిన అన్ని ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరుకున్నాయని అన్నారు.

కొత్త ప్రభుత్వం దృష్టికి రాయలసీమ సమస్యలు

రాయలసీమ ప్రజల హృదయ స్పందన సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవాన్ని జూన్ 10న సంగమేశ్వరం వద్ద ఘనంగా నిర్వహించాలని తీర్మానించినట్లు బొజ్జా తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న సాగునీటి ప్రాజెక్టుల సత్వరం పూర్తి చేయాలని, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల సక్రమ నిర్వహణకు చేపట్టాల్సిన అంశాలపై నివేదికను నూతన ప్రభుత్వానికి అందించాలని సమావేశంలో తీర్మానించారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా చేపట్టాల్సిన హైకోర్టు, సీడ్ హబ్, హార్టికల్చర్ హబ్, అనేక రాష్ట్రస్థాయి కార్యాలయాలు, కార్పొరేషన్‌ల ఏర్పాటుపై నివేదికను నూతన ప్రభుత్వానికి అందించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో రాయలసీమ విద్యావంతుల వేదిక పాణి, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు రత్నం ఏసేపు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, జన విజ్ఞాన వేదిక సభ్యులు శేషాద్రిరెడ్డి, రైతు కూలీ సంఘం కన్వీనర్ సుంకన్న, సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వాడాల చంద్రశేఖర్‌రెడ్డి, టీకేఎస్ కడప జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీలో ఐదుగురు డీబార్

కర్నూలు(అర్బన్), మే 31: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన 4వ సెమిస్టర్ పరీక్షలో ఐదుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 3,156 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 2,893 మంది హాజరయి పరీక్షలు రాశారని తెలిపారు.

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

- సమస్యాత్మక గ్రామాల్లో నిఘా ఉంచాలి
- ఓట్ల లెక్కింపు భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ, ఎస్పీలు

కర్నూలు, మే 31: జూన్ 4వ తేదీన కర్నూలు రాయలసీమ యూనివర్సిటీలో జరగనున్న సార్వత్రిక ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు తెలిపారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీ కౌంటింగ్ కేంద్రాన్ని కలెక్టర్ డా.జి. సృజన, ఎస్పీ జి. కృష్ణకాంత్‌తో కలిసి డీఐజీ భద్రతా ఏర్పాట్లను పరిశలించారు. విజిటర్స్ రిజిస్టర్‌లో డీఐజీ సంతకం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్, కౌంటింగ్ హాల్‌ను, భద్రపరిచిన ఈవీఎంల స్ట్రాంగ్ రూములను పరిశీలించారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్ల గురించి డీఐజీ తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలతో దిశా నిర్దేశం చేశారు. ట్రబుల్ మాంగర్స్‌కు కౌన్సిలింగ్ చేయాలని, నిఘా ఉంచాలన్నారు. ఏజెంట్లు, అభ్యర్థులు చేయాల్సినవి, చేయకూడని వాటి గురించి తెలియజేయాలన్నారు. భద్రతపరంగా కౌంటింగ్ సెంటరు వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. గుంపులు గుంపులుగా గుమికూడి ఉండకుండా చర్యలు తీసుకోవలన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రం వచ్చే ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. గుర్తింపు కార్డును పరిశీలించిన తర్వాత మాత్రమే లోపలికి అనుమతించాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజున అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు గుర్తింపు కార్డులను, ఆర్వోలు ఇచ్చే ధృవీకరణ పత్రాన్ని తనిఖీ చేసి పంపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కౌంటింగ్‌కు వచ్చే వారు మొబైల్స్ తీసుకురాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ సెంటర్‌కు వచ్చే అభ్యర్థులు వార ఏజెంట్లకు సంబంధించిన వాహనాలు వారికి నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాలలో మాత్రమే ఉంచేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఐజీ వెంట అడిషనల్ ఎస్పీ నాగరాజు, నాగబాబు, డీఎస్పీలు విజయశేఖర్, బాబు ప్రసాద్, సీతారామయ్య, శివనారాయణస్వామి, శ్రీనివాసరెడ్డి, ట్రైనీ డీఎస్పీ భావన సీఐలు ఉన్నారు.



విజిటర్స్ రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న డీఐజీ

ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు

మంత్రాలయం, మే 31: మంత్రాలయంలో రామచంద్రనగర్ టవర్ సమీపంలో 135/2 సర్వే నెంబరులోని ప్లాట్ నెంబర్.68 అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఎమ్మిగనూరు సబ్ రిజిస్ట్రార్ రామదాసుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం ఎమ్మిగనూరు చెందిన వాసు లీలావతికి చెందిన ప్లాట్.నెం.68పై దొంగ డాక్యుమెంట్లను సృష్టించి రిజిస్ట్రేషన్ చేశారు. బాధితురాలు వాసులీలావతి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో సబ్ రిజిస్ట్రార్‌తోపాటు మంత్రాలయంకు చెందిన మారెప్ప, మందాకిని, ముకుంద, మహేశ్వర్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రిపై కొడుకుల దాడి



గాయపడ్డ మజ్జిగ నాగప్ప

ఆస్పరి మే 31: మండలంలోని అటేకల్ గ్రామంలో ఆస్తి విషయంలో తండ్రిపై కుమారులు దాడి చేసినట్లు సీఐ హనుమంతప్ప శుక్రవారం తెలిపారు. అటేకల్ గ్రామానికి నాగప్ప తన కుమారులు ప్రకాష్, మస్తాన్ ఆస్తి విషయంలో తగాదా పడ్డారన్నారు. తమకు న్యాయం చేయడం లేదని, తండ్రిపై కుమారులు దాడి చేయడంతో తలకు గాయాలైనట్లు సీఐ తెలిపారు. బాధితుడు నాగప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 31: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.భాస్కర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాసంవత్సరం ప్రారంభం కాకపోయినా అక్రమ అడ్మిషన్లు కొనసాగిస్తున్నారన్నారు. టెక్నో, ఈ-టెక్నో ఒలంపియాడ్ వంటి కొత్త కోర్సుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నగర అధ్యక్షుడు దామోదర్, ఏఐ ఎస్ఎఫ్ నాయకుడు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

సజ్జలను అరెస్టు చేయాలి: టీడీపీ

కర్నూలు(అర్బన్), మే 31: కౌంటింగ్ ప్రక్రియలో వైసీపీ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన సజ్జల రామకృష్ణారెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పక్కన పెట్టి.. రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తామంటే ఒప్పుకునేంది లేదన్నారు. ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు సజ్జలను జైలులో ఉంచాలని డిమాండ్ చేశారు. జూన్ 4న జరిగే కౌంటింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ భారీ మెజార్టీతో గెలవబోతుందని, జీర్ణించుకోలేకే వైసీపీ నాయకులు దాడులకు తెగబడేందుకు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కౌంటింగ్‌లో వైసీపీ ఓటమి తప్పదనే భయంతో దాడులకు తెగబడేందుకు వ్యూహాలు సిద్ధం చేసుకుం టున్నారని సజ్జల వ్యాఖ్యల ద్వారా స్పష్టం అవుతోందని, అలాంటి వాటిపై పోలీసు నిఘా వేయాలని, ముందస్తుగా ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రానుంది'

కర్నూలు(కల్చరల్), మే 31: రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రానుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర అన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గెలుపు స్థానాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కలిసి పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుస్తున్నారని, ఎన్డీఏ కూటమి అభ్యర్థులు జోష్‌లో మునిగి తేలుతున్నారని అన్నారు. మరో నాలుగు రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఆటో దొంగతనాలను అరికట్టండి

కర్నూలు(న్యూసిటీ), మే 31: నగరంలో వరుసగా జరుగుతున్న ఆటోల దొంగతనాలను అరికట్టాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నగరంలో వివిధ ప్రాంతాలలో ప్రతిరోజూ ఎక్కడో ఒక చోట ఆటోల దొంగతనాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితం ఆటో కార్మిక సంఘం నాయకుడి ఆటో పోతేనే ఇప్పటి వరకు పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని.. సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. నగరంలో ఆస్పత్రులు, సినిమా థియేటర్ల ముం దు పెట్టిన ఆటోలను దొంగలించడం పరిపాటి అయిందన్నారు. ఆటోలను రికవరీ చేసి యజమానులకు అప్పగించి కార్మికులను ఆదుకోవాలని కోరారు.

కార్మికుల తొలగింపునకు రంగం సిద్ధం

కర్నూలు(న్యూసిటీ), మే 31: నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న 180 కార్మికులను తొలగించేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. రెండు సంవత్సరాల క్రితం కాలువల్లో పూడిక తీసేందుకు నియమించుకున్న కార్మికు లను విధులకు హాజరుకావద్దని అధికారులు చెప్పినట్లు తెలిసింది. జూన్ 1 నుంచి విధుల్లోకి రావద్దని శుక్రవారం అధికారులు చెప్పడంతో కార్మికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అధికారులు అప్పటిక ప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. గతంలో కూడా ఇలాగే తొలగించాలని అనుకున్న అధికారులకు కౌన్సిల్ సభ్యులు ఒప్పుకోకపోవడంతో ఆగిపోయారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్న నేపథ్యంలో కౌన్సిల్ సభ్యుల ఆమో దం లేకుండానే కార్మికులను తొలగించాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 31: స్థానిక విద్యానగర్‌లోని ఓ కళాశాల గుర్తింపును రద్దు చేయాలని ఆర్ఐవో గురువయ్యశెట్టికి ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ కళాశాల పేరుతో రెండు నెలల నుంచి విద్యా ర్థులు ఇండ్ల వద్దకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అక్రమ అడ్మిషన్లు చేసుకుని వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష, కార్యదర్శులు సాయి ఉదయ్, హర్ష పాల్గొన్నారు.

టార్పాలిన్ లేకుండా ఇసుక తరలించొద్దు



డ్రైవర్లతో మాట్లాడుతున్న గనుల శాఖ డీడీ

కర్నూలు(అర్బన్), మే 31: టార్పాలిన్ లేకుండా ఇసుక రవాణా చేయవద్దని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం నగరంలోని గనుల శాఖ డీడీ కార్యాలయంలో ట్రాక్టర్ డ్రైవర్లను అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంతోపాటు ఇతర ప్రాంతాల్లో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల ద్వారా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ప్రతి వాహన డ్రైవర్ తప్పనిసరిగా టార్పాలిన్ కొనుగోలు చేయాల్సిం దేనని సూచించారు. అనంతరం డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

సి.బెళగల్, మే 31: మండలంలోని తిమ్మనదొడ్డి నదీతీరం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సంగాల, పలుకుదొడ్డి గ్రామాలకు చెందిన తిమ్మప్ప, రామంజినేయులు అనే వ్యక్తులు తుంగభద్రనదిలో నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తొందరపడి విత్తనాలు నాటుకోవద్దు

సి.బెళగల్, మే 31: తొందరపడి విత్తనాలు నాటుకోవద్దు అని మండల వ్యవసాయాధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలో వర్షాలు కురుస్తున్నాయని దృష్టిలో పెట్టుకుని విత్తనాలు నాటితే రైతులు నష్టపోతార న్నారు. భూమిలో వేడి తగ్గిన తరువాత విత్తనాలను నాటుకుంటే అవి మొలు స్తాయన్నారు. వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేసుకునే రైతులు భూమి బాగా చల్లబడిన తరువాత విత్తనాలు వేసుకోవాలని సూచించారు.

8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం

పాణ్యం ఆర్వో నారపురెడ్డి మౌర్య

కర్నూలు(కలెక్టరేట్), మే 31: పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గం కౌంటింగ్ జూన్ 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుందని పాణ్యం రిటర్నింగ్ అధికారి, కర్నూలు జిల్లా జేసీ నారపురెడ్డి మౌర్య వెల్లడించారు. పోస్టల్ బ్యాలెట్ అనంతరం 8:30 గంటల నుంచి ఈవీఎంల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గం కౌంటింగ్ ఏర్పాట్లపై మీడియా ప్రతినిధులతో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ రాయలసీమ యూనివర్సిటీలోని మొదటి అంతస్తు ఇంజనీరింగ్ బ్లాకులో జరుగుతుందన్నార. పాణ్యం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 14 టేబుళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. 5,700 పోస్టల్ బ్యాలెట్‌లను 6 టేబుళ్ల ద్వారా రెండు రౌండ్లలో లెక్కించడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. పాణ్యం నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ 26 రౌండ్లలో పూర్తి అవుతుందన్నారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు ఇతర ఎన్నికల సిబ్బంది గుర్తింపు కార్డులతోనే కేంద్రంలోకి రావాలని ఆమె సూచించారు.



మాట్లాడుతున్న నారపురెడ్డి మౌర్య

భారత పరాక్రమ చరిత్రను వక్రీకరించి రచించారు

వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణు మాలయన్

కర్నూలు(కల్చరల్), మే 31: భారత పరాక్రమ చరిత్రను బ్రిటీష పాలకులు పాఠ్య పుస్తకాల్లో వక్రీకరించి రచించారని వీహెచ్‌పీ కేంద్రీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి స్థాణు మాలయన్ అన్నారు. నగరంలో గుత్తి రోడ్డులోని ఇండస్ పాఠశాల్లో కొనసాగుతున్న బజరంగ్‌దళ్ కార్యకర్తల రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల్లో నాలుగోరోజు కార్యక్రమాలకు స్థాణు మాలయన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మొగలాయీ చక్రవర్తుల తర్వాత బ్రిటీష వారి ఆధిపత్యంలో సుమారు రెండు వందల ఏళ్ల దేశ సంస్కృతి, సంప్రదాయలపై దాడి జరిగిందని చెప్పారు. బ్రిటీష వారి కాలంలో రచించిన చరిత్రతోపాటూ పాఠ్య పుస్తకాల్లోనూ ఈ దేశ పరాక్రమ చరిత్రను వక్రీకరించి రాశారని చెప్పారు. నేటి యువత అసలైన భారత దేశ చరిత్రను తెలుసుకొని, ఆనాటి తప్పిదాలు పునరావృతం కాకుండా దేశ రక్షణ, ధర్మ రక్షణకు తమవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బంజరంగ్ దళ్ ఏపీ కన్వీనర్ తూముకుంట ప్రతాపరెడిడ, రాష్ట్ర కోకన్వీనర్ పోలేపల్లి సందీప్, రాష్ట్ర నాయకులు సి.రవికుమార్, కమ్మయ్య నా యుడు, పెంచల్‌రెడ్డి, శశికుమార్, పిచ్చయ్య చౌదరి, నీలి నరసింహ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న స్థాణు మాలయన్

కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



స్ట్రాంగ్ రూంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్వో

కర్నూలు(న్యూసిటీ), మే 31: రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాకులో ఏర్పాటు చేసిన 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ కౌంటింగ్ హాలులో జరుగుతున్న తుది ఏర్పాట్లను కౌంటింగ్ సంబంధించి వచ్చిన ఎన్నికల సామగ్రిని శుక్రవారం కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ పరిశలించారు. ఓట్ల లెక్కింపు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తల ను వివరించార. అసెంబ్లీ, పార్లమెంటు సంబంధించిన ఈవీఎంలు, భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను, వాటికి వేసిన సీల్లను పరిశీలించి లాగ్ బుక్స్‌లో సంతకం చేశారు. ఆయనవెంట అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్ కుమార్, నగర పాలక ఎంహెచ్‌వో విశ్వేశ్వరర్ రెడ్డి ఉన్నారు.

జూన్ 3న ఓరియంటేషన్ ప్రోగ్రాం

కర్నూలు(కలెక్టరేట్), మే 31: రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ హాలులో జూన్ 3న కౌంటింగ్ సిబ్బందికి ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎన్నికల కౌంటింగ్ సన్నద్ధతపై రిటర్నింగ్, నోడల్ అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బందికి జూన్ 3న రాయలసీమ యూనివర్సిటీలోని కౌంటింగ్ హాలు వద్దకు తీసుకుని వెళ్లి రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించే విధంగా చూసుకోవాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబందించిన కౌంటింగ్ రిజర్వు సిబ్బంది, లైబ్రరీ బ్లాకుల్లోని గ్రౌండు ఫ్లోర్‌లో కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో పాణ్యం ఆర్వో, జేసీ నారపురెడ్డి మౌర్య, కర్నూలు ఆర్వో, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ పాల్గొన్నారు.

ఏసీబీ కోర్టు న్యాయాధికారికి సన్మానం



సునీతను సన్మానిస్తున్న వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు

కర్నూలు(లీగల్), మే 31: పదవీ విరమణ పొందిన ఏసీబీ కోర్టు న్యాయాధికారి బి.సునీతను జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్ కుమార్ శుక్రవారం సన్మానించారు. ఈ మేరకు ఆయనతో పాటు కమిషన్ సభ్యులు ఎన్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్‌లు ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు.

మోదీ మాటలు అర్థరహితం: కాంగ్రెస్

కర్నూలు(అర్బన్), మే 31: ప్రధాని మోదీ మాటలు అర్థరహితంగా ఉన్నాయని కాంగ్రెస్ నాయకులు మండి పడ్డారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ కో-ఆర్డినేషన్ కమిటీ ఛైర్మన్ అనంతరత్నం మాదిగ, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బీ.బతుకన్న, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు లాజ రస్‌లు మాట్లాడారు. జార్ఖండ్ రాష్ట్రంలోని దుమ్కా జిల్లాలోని ఎన్నికల బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ ఆంగ్లేయులు పెట్టిన ఆదివారం సెలవు దినాన్ని మార్చే యోచనలో ఉన్నట్లు చెప్పడం అర్థరహితం అన్నారు. ఆదివారం సెలవు దినాన్ని శుక్రవారానికి మార్చడం మోదీ మతిలేని మాటలు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. వందల ఏళ్లుగా ప్రపంచ దేశాలన్నీ ఆదివారం మాత్రమే సెలవు దినంగా పాటిస్తున్నారని దానిని ఎందుకు మారుస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలి

ఓర్వకల్లు, మే 31: రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించాలని ఏపీ రైతు సంఘం మండల నాయకులు నాగన్న కోరారు. శుక్రవారం ఆర్ఐ రంగస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది వర్షాలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట పై వేసిన పెట్టుబడులు తీర్చలేక అప్పుల్లో కూరుకుపోయారని అన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు 90 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, మాసూం బాషా, మహేష్, జగన్నాథం, శ్రీరాములు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కౌంటింగ్ విధులపై తహసీల్దార్ సమీక్ష

కర్నూలు(రూరల్), మే 31: ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించనున్న వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్, కార్యాలయ సిబ్బందితో శుక్రవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ రామాంజుల నాయక్ తన చాంబర్‌లో సమావేశ మయ్యారు. కౌంటింగ్ కేంద్రంలో పాటించాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల వద్ద కలెక్టర్ ఆదేశాల మేరకు అనుసరిం చాల్సిన నిబంధనలను పకడ్బందీగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. జూన్ 4న జరగనున్న కౌంటింగ్ ప్రారంభం నుంచి పూర్తి అయ్యేంతవరకు కేంద్రం వద్దనే ఉండాలని ఆయన సూచించారు. ఏదైన సమస్య తలెత్తితే వెంటనే ఆక్కడి ఆర్వో దృష్టికి తేవాలని తహసీల్దార్ వీఆర్వో, వీఆర్ఏ, సిబ్బందికి తెలియజేశారు. ఈసమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శివ పాల్గొన్నారు.

ట్రాఫిక్ డివైడర్లు అవసరమా?

కర్నూలు(న్యూసిటీ), మే 31: నగర పాలక సంస్థ పరిధిలో అవసరం లేని చోట ట్రాఫిక్ డివైడర్లు ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఈ.పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వై.జంక్షన్ నుంచి పెద్దపాడు వరకు జరుగుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ పనులను కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈసందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ రోడ్డు మధ్యలో నిర్మిస్తున్న ఆర్‌సీసీ ట్రాఫిక్ డివైడర్‌పై వేస్తున్న మొక్కలకు నేలతో సంబంధం లేకుండా నిర్మిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు పి.ఇక్బాల్, బి.సుకుమార్, సీవీ.వర్మ, శశికుమార్‌రెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కర్నూలు(స్పోర్ట్స్), మే 31: చిన్నారులకు క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సెట్కూరు సీఈవో పీవీ రమణ అన్నారు. డీఎస్ఏ స్టేడియంలో వేసవి అథ్లెటిక్ కోచింగ్ క్యాంపును ఆయన సందర్శించారు. కార్యక్రమంలో డీఎస్‌డీవో భూపతిరావు, శిక్షకులు కాశీరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సస్పెన్షన్ ఎత్తివేయాలి: డీటీఎఫ్

కర్నూలు(ఎడ్యుకేషన్), మే 31: ఎన్నికల విధులకు గైర్హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కరె కృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోట్ల చంద్రశేఖర్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించని పీవో, ఏపీవో, ఓపీవోలకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ ఆఫీసర్లు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలన్నారు. స్థానిక కర్నూలు టౌన్ మోడల్ హైస్కూల్‌లో జూన్ 2న డీటీఎఫ్ 17వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా కౌన్సిలర్లు, మండల అధ్యక్ష కార్యదర్శులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా బాధ్యులు వెంకటే శప్ప, జయానంద్, రవీంద్ర, గుమ్మ శ్రీనివాసులు, రంగస్వామి, శివశంకర్ పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి

జిల్లాలో వివిధ క్షేత్రాలు, ధార్మిక సంస్థల్లో వేడుకలు

కర్నూలు(కల్చరల్), మే 31: వైశాఖ బహుల దశమిని పురస్కరించుకొని హనుమజ్జయంతి వేడుకలను శనివారం జిల్లాలోని వివిధ దేవాలయాలు, ధార్మిక సంస్థల్లో ఘనంగా నిర్వహించనున్నారు. అందుకు ఆయా ప్రాంతాల్లో భక్తులకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు మండలంలోని ఈ. తాండ్రపాడు ఆంజనేయస్వామి దేవస్థానంలో, నంద్యాల జిల్లా మిడుతూరు మండలం పీరూసాహెబ్ పేటలోని శ్రీరామాలయంలో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం జయంతి వేడుకల పోస్టర్లను ఇ.తాండ్రపాడులో ఆవిష్కరించారు.

● నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్ష, గౌరవాధ్యక్షులు కె.కృష్ణన్న, మోక్షేశ్వరుడు తెలిపారు.

● జగన్నాథ గట్టుపై అభయాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇ. మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



వేడుకల వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ మల్లు వెంకటరెడ్డి

పొగాకు ఉత్పత్తులు ప్రమాదకరం



డాక్టర్ రమేష్‌బాబును సన్మానిస్తున్న జి.పుల్లారెడ్డి, డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), మే 31: పొగాకు ఉత్పత్తులను వినియోగించడం ఆరోగ్యానికి ప్రమాదకరమని మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ బి.రమేష్ బాబు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం జి.పుల్లారెడ్డి డెంటల్ కాలేజీలో అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. భారతదేశం జనాభాలో దాదాపు 35 శాతం పొగాకు ఉత్పత్తులను ఉపయోగిస్తున్నారని, పొగాకులో 7000 హానీకరమైన టాక్సిన్స్, వాటిలో 700 క్యాన్సర్ కారకాలు ఉన్నాయనీ హెచ్చరించారు. కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి, డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.వై.మురళీధర్ రెడ్డి, డెంటల్ వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటగిరిలో ప్రభోత్సవం



గిడ్డాంజనేయస్వామి ప్రభోత్సవానికి హాజరైన భక్తులు

కోడుమూరు(రూరల్), మే 31: మండలంలోని వెంకటగిరిలో హనుమజ్జయంతి వేడుకలలో భాగంగా శుక్రవారం రాత్రి ప్రభోత్సవం వైభవంగా జరిగింది. సాయంత్రం ప్రభపై స్వామివారిని ఊరేగించారు. శనివారం సాయంత్రం గిడ్డాంజనేయస్వామికి రథోత్సవం నిర్వహించ నున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

తెలంగాణ మద్యం బాటిళ్లు సీజ్

కర్నూలు(అర్బన్), మే 31: తెలంగాణ నుంచి అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న 417 మద్యం బాటిళ్లు సీజ్ చేశామని సెబ్ సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాహనాలను తనిఖీలు చేయగా ద్విచక్రవాహనాల్లో తరలిస్తున్న మద్యం బాటిళ్లతో పాటు 4 వ్యక్తులను అదుపులోకి తీసుకుని 3 కేసులు నమోదు చేశామని తెలిపారు. నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించి నాటు సారా తయారీ కోసం సిద్ధం చేసిన 4,445 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామని, 5 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు.

అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు

గూడూరు, మే 31: ఎన్నికల కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎవరైనా అక్రమ మద్యం తరలించినా, విక్రయించినా అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హెచ్చరించారు. శుక్రవారం గూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో సుంకేసుల చెక్‌పోస్టు పరిధిలోని ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు వద్ద ఎస్ఐ హనుమంతయ్య ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు.

డీడీవోపీకి ఘనంగా వీడ్కోలు

కర్నూలు(లీగల్), మే 31: పదవీ విరమణ చేసిన డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అజేకల్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, న్యాయవాదులు ఆయన్ను ఘనంగా సన్మా నించారు. కార్యక్రమానికి కర్నూలు రేంజ్ డీఐజీ విజయరావు, నూతన డీడీవోపీ ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పరిపాలనదక్షుడు డాక్టర్ వెంకటరంగారెడ్డి



సూపరింటెండెంట్ దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్), మే 31: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి పరిపాలనదక్షులని ఆసుపత్రి కొత్త సూపరింటెండెంట్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. పదవీ విరమణ చేస్తున్న సూపరింటెండెంట్ దంపతులను శుక్రవారం సాయంత్రం ధన్వంతరీ హాలులో కార్యాలయ ఉద్యోగులు సన్మానించారు. 10 నెలల వ్యవధిలో డాక్టర్ వెంకట రంగారెడ్డి స్ట్రోక్ యూనిట్, టెక్సా యంత్రం, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజి విభాగాలను అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, ఆర్ఎంవో వెంకటరమణ, ఏడీ అనిల్ కుమార్ రెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్, కుమారస్వామి, ఏవో శ్రీనివాసులర, సీనియర్ అసిస్టెంట్లు చిరంజీవి, రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న సీఐ కిరణ్ కుమార్ రెడ్డి

ఓర్వకల్లు, మే 31: జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ముందుగా గానీ, అనంతరం గానీ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని కర్నూలు రూరల్ సీఐ హెచ్చరించారు. శుక్రవారం ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఓర్వకల్లు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయా పార్టీల రాజకీయ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్ఐ రాజారెడ్డి మాట్లాడుతూ కౌంటింగ్ ముందుగా గానీ, అనంతరం గానీ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ప్రతి ఒక్క పార్టీ నాయకుడు సహకరించాలని వారు కోరారు. మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడైనా గుంపులు గుంపులుగా ఉంటే వారిని అరెస్టు చేసి కేసు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు, పోలీసులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కర్నూలు(కల్చరల్), మే 31: పేదలను ఆదుకోవడంలో సామాజిక సేవా సంస్థలు ముందుండాలని మానస సేవా సంఘం అధ్యక్షుడు బైలుప్పల షఫీయుల్లా, 48వ వార్డు రోజావీధి మహిళా సేవా విభాగం సమన్వయకర్త మీసాల సుమలత అన్నారు. శుక్రవారం రోజా వీధిలో పేదలకు నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు.

క్రీడా పరికరాలు అందజేత

కర్నూలు(స్పోర్ట్స్), మే 31: స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో యోగా శిక్షకులకు కేఎంసీ సహకారంతో క్రీడా పరికరాలను డీఎస్‌డీవో భూపతి రావు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షకులు అంకితభావంతో యోగా చేయించి ఆరో గ్యవంతమైన క్రీడాకా రులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. యోగా శిక్షకుడు అవినాశ్ శెట్టి, మునిస్వామి, డీఎస్ఏ సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు

గూడూరు, మే 31: కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్, గూడూరు ఎస్ఐ హనుమంతయ్య హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని సుంకేసుల, రేమట, గుడిపాడు గ్రామాల్లో పర్యటించి ఆయన సిబ్బందితో కలిసి గ్రామస్థులతో మాట్లాడుతూ జూన్ 4న కౌంటింగ్ జరగనుందని.. ఈ నేపథ్యంలో ఎవరైనా గ్రామాల్లో బెట్టింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



మద్దికెర సంతకు వచ్చిన వినియోగదారులు

కిలో మిర్చి రూ.100

● భగ్గుమంటున్న కూరగాయల ధరలు
● కొనలేని స్థితిలో సామాన్యులు



మద్దికెర, మే 31: మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఎండలు మండిపోతుండటంతో కూరగాయల సాగుకు కష్టమైపోయింది. పంట సాగు చేసిన దిగుబడులు దక్కని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే మార్కెట్‌కు ప్రజా అవసరాలకు సరిపడా కూరగాయలు రావడం లేదు. దీంతో కూరగాయల ధరలకు అమాంతం రెక్కలొచ్చాయి. దీంతో సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు కూరగాయలను కొనలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా మద్దికెరలో శుక్రవారం, పెరవలిలో గురువారం, ఎం.అగ్రహారం గ్రామాల్లో జరిగే వారపు సంతల్లో వ్యాపారం సరిగా జరగడం లేదు.

ఏ కూరగాయ తీసుకోవాలన్నా రూ.50 పైమాటే..

ఏ రకం కూరగాయ కొనాలన్నా కిలో రూ.50 పైమాటే. ముఖ్యంగా మిర్చి ధర మరీ ఘాటెక్కింది. కిలో రూ.100లకు పైగానే ఉంటోంది. తెల్లరకం రూ.30 పలుకుతోంది. టమోటా రూ.40, బీన్స్ కిలో రూ.60, క్యారెట్ రూ.80, కాకర రూ.60 పలుకుతున్నాయి. మునగ కిలో రూ.80 ఉంది. ఆకుకూరల ధరలు ఇదేవిధంగా ఉన్నాయి. ఆకుకూరలైతే రూ.20కి నాలుగైదు రకాలు వచ్చేవి. ఇప్పుడు రెండు రకాల ఆకు కూరలు కూడా రావడం లేదు. కొత్తిమీర కిలో కట్ట రూ.400 పలుకుతోంది.

● సామాన్యులకు చుక్కలు చూపుతున్న ధరలు



కూరగాయల మార్కెట్‌లో వంద, రెండొందలకు విలువ లేకుండా పోయింది. ముగ్గురు నలుగురు ఉండే చిన్న కుటుంబానికి వారానికి సరిపడా కూరగాయలు కొనాలంటే రూ.300-400 పెట్టాల్సిందేనని సామాన్య మధ్యతరగతి కుటుంబాల వారు పేర్కొంటున్నారు. నెల కిందట వరకు రూ.200 ఖర్చు చేస్తే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రూ.500 ఖర్చు చేసినా సరిపడా కూరగాయలు రావడం లేదు. బహిరంగ మార్కెట్‌లో అయితే.. అంతకు రెండింతలు ఖర్చు చేయాల్సి వస్తోంది. నిత్యం వినియోగించే టమోటా, మిర్చి ఆళ్లగడ్డ ధరలు సైతం భారీగా పెరిగాయి. ఇక ఆకుకూరల పరిస్థితి కూడా అలాగే ఉంది. నెల క్రితం రూ.5, 10కు కొత్తిమీర ఇచ్చేవారు. ఇప్పుడు రూ.10 నుంచి 15 వరకు పలుకుతోంది.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో పంచాయతీ కార్యాలయానికి వచ్చిన మహిళలు

హొళగుంద, మే 31: హొళగుందలోని 5వ వార్డుకు చెందిన కాలనీ వాసులు మల్లమ్మ, మారెమ్మ, మునెమ్మలు శుక్రవారం నీటి కోసం పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా నీటి సమస్య తీవ్రంగా ఉందని అన్నారు. పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు నీటి సమస్య తీర్చకపోతే కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో నీటి సమస్య లేకుండా చూస్తామని చెప్పారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆస్పరి, మే 31: ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంటలు సాగు చేసి, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏవో నరేంద్ర కుమార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లో వేసిన పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, ఉల్లి మొదలగు పంటలకు సకాలంలో వర్షాలు రాక ఎండిపోయాయని అన్నారు. ప్రభుత్వం ఈ నెల 18న పంపిణీ చేసిన పంట నష్టపరిహారం కొంత మంది రైతుల ఖాతాలో మాత్రమే జమ చేసిందని తెలిపారు. నష్టపోయిన ప్రతి రైతు ఖాతాలో నష్టపరిహారం నగదును జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి విరుపాక్షి, కృష్ణమూర్తి, రైతు సంఘం మండల కార్యదర్శి ఉకుందప్ప, హరికృష్ణ, ఆంజనేయ, తిమ్మన్న, పాల్గొన్నారు.

రోగులకు సేవ చేయడం గొప్ప అవకాశం

● సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఆదోని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు

ఆదోని (అగ్రికల్చర్), మే 31: రోగులకు సేవ చేయడం దేవుడిచ్చిన గొప్ప అవకాశం అని ఆదోని సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాస్ నాయక్ అన్నారు. శుక్రవారం సర్వజన ఆసుపత్రిలో అప్రెంటిస్‌కు ఎన్నికైన నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలకు చెందిన 58 మంది నర్సింగ్, ఎంఎల్‌టీ విద్యార్థులను ఆయన అభినందించారు. వారు మాట్లాడుతూ, ఎంతో మంది రోగులు ఆసుపత్రికి వైద్యం కోసం వస్తుంటారని, వారికి సరైన చికిత్స ఇస్తే ఎంతో సంతోషపడతారని అప్రెంటిస్ కాలంలో అన్ని పనులను నేర్చుకోవాలని సూచించారు. అనంతరం సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేసి అందించారు. కళాశాల కరస్పాండెంట్ సంఘటి దేవదానం, ప్రిన్సిపల్ అబ్దుల్ బాషా, డాక్టర్ సలోమి, దివాకర్ ఆసుపత్రి డాక్టర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శారద, డాక్టర్ చక్రపాణి పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

ఆదోని టౌన్, మే 31: జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న కొత్త ట్రాఫిక్ నిబంధనలపై ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రుల అడ్వైజరీ కమిటీ సభ్యుడు నసీరుద్దీన్ పటేల్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అతివేగం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్న కారణంగా అలాంటి వారిపై జరిమానా పెంచారని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనాలను నడిపే వారిపై జరిమానాలు విధించడంపై విద్యాసంస్థలలో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనల గురించిన అవగాహన కార్యక్రమాలను ప్రతినెలలో ఒక రోజు ఏర్పాటు చేసి ప్రజలలో, ముఖ్యంగా యువతలో మార్పు తీసుకు రావాలని అన్నారు.

అక్రమ అడ్మిషన్లకు కళ్లెం వేయాలి

ఆదోని (అగ్రికల్చర్), మే 31: పట్టణంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న అక్రమ అడ్మిషన్లకు కళ్లెం వేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ అన్నారు. శుక్రవారం డిప్యూటీ ఈవో కార్యాలయం సీసీ చంద్రశేఖర్‌ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంవత్సరం ఆరంభం కాకమునుపే కార్పొరేట్ సంస్థలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటున్నాయని అన్నారు. ఫలితాల పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తూ వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాంటి పాఠశాలను గుర్తించి వెంటనే గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేష్, రసూల్, వీరేష్, సునీల్, సంతోష్, వంశీ పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలి

కోసిగి, మే 31: కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావాలని టీడీపీ, బీజేపీ నాయకులు శుక్రవారం పూజలు నిర్వహించారు. ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ, ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు మంత్రాలయం ఎమ్మెల్యేగా ఎన్.రాఘవేంద్రరెడ్డి గెలవాలని కోరుతూ అగసనూరు గ్రామానికి చెందిన టీడీపీ, బీజేపీ నాయకులు కోసిగిలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు.



కోసిగి రేణుకా ఎల్లమ్మ దేవికి పూజలు చేస్తున్న నాయకులు

రోడ్డు ప్రమాదాలపై చర్యలు చేపట్టండి

● సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ఆదోని, మే 31: రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సబ్ కలెక్టర్ వారి కార్యాలయంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమీక్షల్లో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. పట్టణంలో కొత్త బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కొత్త బస్టాండ్ సమీపంలోని రోడ్డుపైకి పశువులు రాకుండా చూసుకునేలా యజమానులకు సూచించాలని అన్నారు. పెద్ద మార్కెట్ ఏరియాలో పార్కింగ్ సమస్య ఎక్కువగా ఉందని, వాటిపై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. మెయిన్ రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వాహదారులపై జరిమానాలు వేయాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మెయిన్ రోడ్లపైన నిబంధనలకు విరుద్ధంగా ఏదైనా కట్టడాలు జరిగితే, విచారణ చేసి తొలగించాలని మునిసిపల్ అధికారులకు ఆదేశించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి, రోడ్లు, భవనాలు శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, పంచా యతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకట్‌ప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, మున్సి పల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, (ట్రాఫిక్) సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాద్



చెట్నహళ్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ గోపినాథ్

కౌతాళం, మే 31: ఓట్ల లెక్కింపు సందర్భంగా గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీలు శాంతియుతంగా ఉండాలని కోసిగి సీఐ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని వివిధ పార్టీ నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి ర్యాలీలకు అనుమతి లేదని అన్నారు. ఫలితాలు ఎలా ఉన్నా ప్రజల స్వేచ్ఛకు భంగం కలుగకుండా రాజకీయ నాయకులు నడుచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● వెల్దుర్తి: కౌంటింగ్ రోజున, ఫలితాలు వెలువడ్డాక ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఘర్షణలకు పాల్పడకుండా ఎన్నికల నిబంధనలు పాటించాలని తెలిపారు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

● మద్దికెర: జూన్ 4న ఎన్నికల ఫలితాల అనంతరం ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మద్దికెరలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఫలితాలు వెలువడిన తర్వాత ఎవరైనా టపాసులు కాల్చినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ఎన్నికలకు సంబంధించి రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

● ఎమ్మిగనూరు రూరల్ : మండలంలో అల్లర్లు సృష్టిస్తే ఉపేక్షించేది లేదని రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిధిలోని సిరాలదొడ్డి, కడిమెట్ల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ దగ్గర పడుతోందని, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రశాంతంగా ఉండాలన్నారు.

● తుగ్గలి : ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే.. చర్యలు తప్పవని తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐలు మల్లికార్జున, రామాంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని తుగ్గలి, జొన్నగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో వారు పర్యటించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు గుంపులు గుంపులుగా ఉండకుండా ఎవరి ఇళ్లలో వారు ఉండాలన్నారు. అలాగే బాణాసంచా కాల్చడం, ర్యాలీలు వంటివి చేయకూడదని సూచించారు.

● మంత్రాలయం: మండలంలోని ఎన్నికల కౌంటింగ్ రోజున అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం, మాదవరం ఎస్ఐలు గోపినాథ్, కృష్ణమూర్తిలు అన్నారు. శుక్రవారం సాయంత్రం చెట్నహళ్లిలో ఎస్ఐ గోపినాథ్ గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. అదేవిధంగా మాధవరంలో ఎస్ఐ గోపినాథ్, కృష్ణమూర్తి, ఏఎస్ఐ బందెనవాజ్‌లతో కలిసి అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. కౌంటింగ్ ముందు, అనంతరం ఎన్నికల కోడ్‌ను తప్పక పాటించాలని, అల్లర్లకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఓటమి భయంతోనే దిగజారుడు వ్యాఖ్యలు

ఆస్పరి మే 31: వైసీపీ ఓటమి భయంతోనే ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి ముత్యాల రెడ్డి, ఎంపీటీసీ నరసప్ప అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఓడిపోతుందనే అసహనంతో ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. కౌంటింగ్‌లో రూల్స్ పాటించే వాళ్లు తమకు అవసరం లేదని అనడం చూస్తుంటే, వారి దిగజారుడు తనానికి నిదర్శనంగా తెలుస్తుందన్నారు. ఎన్నికల నియమావళి దేశంలో అన్ని పార్టీలకు వర్తిస్తుందని, నిబంధనల మేరకే ఎన్నికల ప్రక్రియ కౌంటింగ్ ఉంటుందని, ఇష్టానుసారంగా వ్యవహరించడానికి వైసీపీ ప్రభుత్వం కాదని అన్నారు. కార్యక్రమంలో నారాయణ, రామలింగప్ప, హనుమంతు, ఆంజనేయ, రామలింగ పాల్గొన్నారు.



ఆస్పరిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వైభవంగా కాత్రికి రంగస్వామి రథోత్సవం

ఆలూరు రూరల్, మే 31: మండల పరిధిలోని కాత్రికి గ్రామంలో వెలసిన రంగస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో రంగస్వామి, వెంకటేశ్వర స్వామి వారికి గంగిపూజ, పుష్పాలంకరణ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామి వారిని గ్రామ పురవీధుల గుండా పల్లకిలో ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హరిచంద్ర రెడ్డి, రమేష్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోమశేఖర్, లక్ష్మీరెడ్డి, డీలర్ రంగస్వామి, కుందనగుర్తి నాగప్ప, వెంకటేష్, శ్రీధర్ రెడ్డి, వీరేశ్, రంగన్న, రమేష్ పాల్గొన్నారు.

రైతులకు పరిహారం అందించాలి

ఆలూరు, మే 31: రబీ సీజన్‌లో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరి హారం చెల్లించాలని టీడీపీ రైతు కమిటీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సీ నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేఖరుల తో మాట్లాడుతూ రబీలో రైతులు అప్పులు చేసి జొన్న, శనగ, వేరుశనగతో పాటు వివిధ రకాల పంటలు సాగు చేసినా వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారన్నారు. ఖరీఫ్ ఆరంభం కావడంతో రైతులు పంటలు సాగు చేసేందుకు పెట్టుబడులు లేవని, పంట నష్ట పరిహారం అందిస్తే రైతులు ఆర్థికంగా కోలుకుంటారన్నారు.

కొత్త ఆర్వోగా చల్లా విశ్వనాథ్



మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్వో సి.విశ్వనాథ్

మంత్రాలయం, మే 31: మంత్రాలయం ఆర్వో మురళిపై బదిలీ వేటు పడటంతో ఆయన స్థానంలో కొత్త ఆర్వోగా చల్లా విశ్వనాథ్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆర్వో మురళికి వీడ్కోలు, కొత్త ఆర్వో విశ్వనాథ్ బాధ్యతలు చేపట్టడం రెండూ ఒకే రోజు జరిగిపోయాయి. ఈ సందర్భంగా నూతన ఆర్వో విశ్వనాథ్ మాట్లాడుతూ మంత్రాలయం 237 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఎన్నికల్లో 14 టేబుళ్లు, 17 రౌండ్లలో లెక్కించేందుకు పూర్తి స్థాయిలో కౌంటింగ్‌పై దృష్టి సారిస్తామన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన టేబుళ్లు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ సిబ్బంది కర్నూలు రాయలసీమ యూనివర్సిటీ లైబ్రరీ బ్లాక్‌కు జూన్ 4న మంగళవారం ఉదయం 5:30 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీధర్‌మూర్తి, కౌతాళం తహసీల్దార్, అలెగ్జాండర్, కోసిగి తహసీల్దార్ మురళి, పెద్దకడుబూరు తహసీల్దార్ సురేష్‌బాబు, డీటీలు గురురాజరావు పాల్గొన్నారు.

డ్రైవర్ మహబూబ్ బాషాపై విచారణ



కల్లుదేవకుంట పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి

మంత్రాలయం, మే 31: ప్రభుత్వ డ్రైవరు మహబూబ్ బాషాపై ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి శుక్రవారం విచారణ చేపట్టారు. మహబూబ్ బాషాపై మంత్రాలయం మండలం కల్లుదేవకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈయన ప్రభుత్వ ఉద్యోగం జీతం తీసుకుంటూ.. ప్రైవేటు నర్సింగ్ హోమ్‌లో పని చేస్తున్నాడు. శుక్రవారం కల్లుదేవకుంట పీహెచ్‌సీ కేంద్రం వద్ద ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టారు. అక్కడ పని చేస్తున్న మండల వైద్యాధికారులు గోవిందమ్మ, వసంతమ్మలు ఆసుపత్రి సిబ్బందితో ఆరా తీశారు. నెల వరకు డ్రైవర్ మహబూబ్ బాషా విధులకు సక్రమంగా హాజరు కాకపోతే డీఎంహెచ్‌వోకు సరెండర్ చేస్తామని సత్యవతి తెలిపారు.

చంద్రబాబును కలిసిన మీనాక్షినాయుడు



చంద్రబాబు నాయుడితో మీనాక్షినాయుడు

ఆదోని, మే 31: విదేశీ పర్యటన ముగించుకొని హైదరాబాద్‌కు విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆదోని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు శుక్రవారం కలిశారు. ఆదోని ఎన్డీఏ కూటమి అభ్యర్థి గెలుపుపై చర్చించారని ఆంధ్రజ్యోతికి వివరించారు. బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం తీవ్ర స్థాయిలో కృషి చేసినందుకు అభినందించారని చెప్పారు. రాబోయే ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో ఆదోని నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జిగా పార్టీని మరింత బలోపేతం కోసం కృషి చేయాలని చంద్రబాబు సూచించారని వివరించారు. రాబోయేది ఎన్డీఏ ప్రభుత్వమేనని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరినీ గుర్తించి సమన్యాయం చేయాలని చెప్పారని అన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఎమ్మిగనూరు, మే 31: పట్టణంలోని 16వ వార్డులోని దోబీఘాట్ వంకపై నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనుల్లో నాణ్యాత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ గింగిరెడ్డి సూచించారు. శుక్రవారం పనులను కమిషనర్ పరిశీలించారు. అనంతరం ఆయన శక్తి నగర్‌లోని 13వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై రివ్యూ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందించే సేవల్లో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట డీఈఈ విక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

రోగి ప్రాణాలు కాపాడిన వైద్యులు

వెల్దుర్తి, మే, 31: గుండెనొప్పి వచ్చిన వ్యక్తికి సరైన సమయంలో మెరుగైన చికిత్స అందించి ప్రాణాలు కాపాడిన సంఘటన వెల్దుర్తిలో చోటు చేసుకుంది. అల్లుగుండు గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఛాతి నొప్పితో వెల్దుర్తిలో ఉన్న సీహెచ్‌సీ ఆసుపత్రికి వచ్చారు. బాధితుడి పరిస్థితిని గమనించి డాక్టర్లు ఈసీజీ తీయించి గుండె నొప్పిగా గుర్తించి వెంటనే ఇంజక్షన్ ఇచ్చారు. అనంతరం కర్నూలు సర్వజ న వైద్యశాలకు తరలించారు.

విత్తన కొరత లేకుండా చుడాలి

దేవనకొండ, మే 31: సచివాలయాలలో రైతులకు విత్తన కొరత లేకుండా చుడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్ అన్నారు. రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని పల్లెదొడ్డి, కుంకనూరు, తెర్నేకల్, దేవనకొండ, పి.కోటకొండ గ్రామాల్లోని సచివాలయాల వద్ద నిరసన తెలిపారు. రైతులు సాగు చేసే పంటల విత్తనల కొరత వల్ల బయట మార్కెట్‌లో అధిక ధరలకు నాసిరకం విత్తనాలను కొనుగోలు చేసి రైతులు నష్టపోవడం జరుగుతుందన్నారు. మండల కార్యదర్శి సూరి, అశోక్, శ్రీరాములు, బండ్లయ్య, తదతరులు పాల్గొన్నారు.

బాణసంచా పట్టివేత

వెల్దుర్తి, మే, 31: వెల్దుర్తిలో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన బాణసంచాను ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం పట్టుకున్నారు. పట్టణంలో స్థానిక బాలుర హైస్కూల్ ఎదురుగా సుధా ఫ్యాన్సీ దుకాణంలో రూ.15 వేల విలువ చేసే బాణసంచాను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.

పరిహారం అందేలా చూస్తాం

మద్దికెర, మే 31: మండలంలోని హంపా, కొత్తపల్లి, బొమ్మనపల్లి గ్రామాలకు చెందిన రైతులకు పంట నష్ట పరిహారం అందేలా చూస్తామని వ్యవసాయ శాఖ అధికారి యు.రవి, వ్యవసాయ సహాయకులు అనంతరాజు అన్నారు. ఈ నెల 30న ఆంధ్రజ్యోతిలో అధికారుల తప్పిదం, అందని పరిహారం అనే వార్తకు స్పందించిన వ్యవసాయ శాఖ అధికారి, సహాయకులు అనంతరాజు శుక్రవారం పెరవలి గ్రామంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వెళ్లి విచారణ చేపట్టారు. ఐఎఫ్ఎస్‌సీ కోడ్ తప్పిదం వల్ల 30 మందికి పరిహారం అందలేదని, అయితే.. ఈ డబ్బులు ఎక్కడకు వెళ్లవని రైతులకు అందుతాయని తెలిపారు. హంపా, బొమ్మనపల్లి, పెరవలి గ్రామాల్లో 30 మందికి మాత్రమే పరిహారం అందలేదని, వీరందరికీ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

బెట్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

కోసిగి, మే 31: వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ కాస్తున్న మహిళా నాయకురాలు మాజీ జడ్పీటీసీ దలవాయి మంగమ్మపై ఎన్నికల అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్సీ సెల్ నాయకులు సోల్మాన్ రాజు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఎవరు గెలిచినా ఓడినా స్వాగతించాలని, రానున్న ఎన్నికల్లో మంత్రాలయం నియోజకవర్గం అభివృద్ధి కోసం పని చేయాలని బెట్టింగులు కట్టడం, గొడవలకు ఉసిగొల్పడం మంచి పద్ధతి కాదని, కొందరు సోషల్ మీడియా వేదికగా తమ పార్టీలు గెలుస్తున్నాయని బెట్టింగులు కడుతున్న వారిపై ఎన్నికల అధికారులు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జనాలు లేని 'ఆరోగ్య సురక్ష'

కౌతాళం, మే 31: కౌతాళంలో శుక్రవారం గ్రామ సచివాలయంలో డాక్టర్ పావని ఆధ్వర్యంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించగా జనాలే లేరు. ప్రజలకు ముందస్తు సమాచారం లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడినట్టు తెలుస్తోంది. సర్పంచ్ పాల్‌దినకరన్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి కార్యక్రమం నిర్వహించినట్టుగా కటింగ్ ఇచ్చి ఆ తరువాత చేతులు దులుపుకున్నారు.

కలుషిత నీరు సరఫరా చేస్తే చర్యలు

చిప్పగిరి, మే 31: కలుషిత తాగునీటిని సరఫరా చేస్తే చర్యలు తీసుకుంటామని జూటూరు హేమలత, ఎంపీడీవో బారాన్ సాహెబ్ హెచ్చరించారు. శుక్రవారం చిప్పగిరి మండల కార్యాలయంలో ఎంపీపీ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉప-తహసీల్దారు ఇజాజ్ అహ్మద్, సూపరిండెంట్ శ్రీనివాసులు, ఏవో విజయలక్ష్మి, డాక్టర్ పార్వతమ్మ, ఏఈ భవ్య ఉలిగెప్ప, ఏపీఎం నాగార్జున, ఏపీవో మాధవ శంకర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.